సాక్షి ఒడిశా

ఆదివారం । 16 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,01,757లు, బంగారం 3గ్రాములు, వెండి 72 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సీనియర్ నేతలపై వేటు!

- 8లో



రాష్ట్రాభివృద్ధే బీజేడీ ధ్యేయం

- 8లో

న్యూస్‌రీల్

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



ప్రమాదం జరిగిన వసతిగృహం వంట గది

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నీలాద్రినగర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వసతి గృహంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. శుక్రవారం రాత్రి వంట చేస్తుండగా గ్యాస్ పైప్ నుంచి మంటలు వ్యాపించడంతో పెద్ద శబ్దంతో సిలిండర్ పేలిపోయింది. అయితే ముందే అప్రమత్తమైన వంట మనిషి బయటకు వచ్చి కేకలు వేయడంతో మిగతా సిబ్బంది కోరుకొండ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకొని, మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదం ఎటువంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వసతి గృహంలో సుమారు 100మంది విద్యార్థులు ఉంటున్నారు.

మైనర్‌ను అపహరించిన నిందితుడి అరెస్ట్



నిందితుడు ఆకాశ్ హరిజన్

జయపురం: మైనర్‌ను బలవంతంగా ఎత్తుకు వెళ్లి, అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలపై ఓ యువకుడిని జయపురం మహిళా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారని ఐఐసీ మమతా పాణిగ్రాహి వెల్లడించారు. నిందితుడు చిల్లిగుడ ప్రాంతానికి చెందిన ఆకాశ్ హరిజన్(19)గా వెల్లడించారు. బాధితురాలిని రక్షించి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచడంతో పాటు వాగ్మూలం రికార్డు చేశారు. నిందితుడు ఆకాశ్ హరిజన్‌ను కోర్టుకు తరలించారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 2న తమ కుమార్తె కనిపించక పోవటంతో చిల్లిగుడ గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు పరిసరాల్లో వెతికారు. ఎప్పటికీ ఆచూకీ లేకపోవడంతో జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. బాలికతో పాటు ఆమెను ఎత్తుకుపోయిన నిందితుడు ఆకాశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాంగూల్మం నమోదు చేసి, పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అలాగే నిందితుడిని కోర్టులో హాజరు పరిచిన అనంతరం జైలుకు తరలించారు.

అన్నపై కత్తితో తమ్ముడి దాడి

- భూ తగాదాల నేపథ్యంలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామ మడకామి

మల్కన్‌గిరి: జిల్లాలోని పొడియా సమితి నిలిగూడ పంచాయతీ చెరుకుగూడ గ్రామంలో చోటు చేసుకున్న భూ తగాదాలతో అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన అన్న.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మల్ల మడకామి, తన పెద్దనాన్న కుమారుడు, రామ మడకామి మధ్య గత కొంతకాలంగా పొలం విషయంలో వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పొలం పని ముగించుకున్న రామ.. అక్కడే విశ్రమించాడు. ఒంటరిగా ఉండటాన్ని గమనించి మల్ల.. అన్నపై కత్తితో దాడి చేశాడు. దీంతో బాధితుడు కేకలు వేయగా, చుట్టుపక్కల ఉన్న రైతులు ఆయనను రక్షించి, పోలీసులకు సమాచారం అందించారు. రామ ఛాతి, మెడపై తీవ్ర గాయాలు కావడంతో మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

ముగిసిన శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరం ముగింపులో విద్యార్థులు, అధికారులు

పర్లాకిమిడి: స్థానిక కృష్ణచంద్ర గజపతి కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్, జిల్లా రెడ్‌క్రాస్ ఆధర్వంలో జరిగిన 3రోజుల ప్రథమ చికిత్స శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఇందులో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 30మంది విద్యార్థులు హాజరయ్యారు. శిబిరంలో కౌన్సిలర్ డాక్టర్ పరమానంద జెన్నా, ప్రథమ చికిత్స అధికారి డాక్టర్ బికాస్‌కుమార్ ప్రథమ చికిత్సపై శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సుకాంత బెహరా మాట్లాడుతూ శిక్షార్థులను అభినందించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బి.గోవిందరావు చేతులమీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌కుమార్ త్రిపాఠి, సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన చరిత్ర!

- ఉరుములు, మెరుపుల ప్రభావంతో కూలిన రామేశ్వరాలయ కిరీటం
- 12వ శతాబ్దంలో సోమ వంశీకుల పాలనలో నిర్మాణం



కిరీట విహీన రామేశ్వర ఆలయం



నేలకొరిగిన ఆలయ కిరీటం(శిఖరాగ్ర భాగం)

భువనేశ్వర్: స్థానిక నగరంలోని ప్రాచీన రామేశ్వర ఆలయం కిరీటం శనివారం నేలకొరిగింది. మౌసి మా స్క్వేర్‌లో ఉన్న కిరీటం(దధినౌతి) కురిసిన కుండపోత వానలు, ఉరుములు, మెరుపుల ధాటికి ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఆలయం 12వ శతాబ్దానికి చెందినదిగా చరిత్రకారుల సమాచారం. సోమ వంశీకుల పాలన తుది దశలో దీని నిర్మాణం జరిగినట్లు భావిస్తారు. సుమారు 60 అడుగుల ఎత్తు నుంచి ఆలయ శిఖరాగ్ర భాగం నేలకొరిగింది. ఉదయం 10.10 గంటల సమయంలో ఇది చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. ఆ సమయానికి ఆలయం లోపల యథావిధిగా పూజలు చేస్తున్న అర్చకులకు భారీ శబ్దం వినిపించడంతో బెంబేలెత్తి బయటకు పరుగులు తీయడంతో పరిస్థితి తారసపడింది. కొంతమంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉండగా, అదృష్టవశాతు ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కారణాలు తెలియాల్సి ఉంది..

రామేశ్వర ఆలయం శిఖరాగ్ర శిలాభాగం నేలకొరగడం కలకలం రేపింది. ఈ సమాచారం అందడంతో ఆలయ సంరక్షక నిపుణుల వర్గం ఘటనా స్థలానికి హుటాహుటిన చేరింది. ఆలయ సముదాయాన్ని ఈ బృందం పరిశీలిస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆలయ కిరీటం నేలకొరిగిన పరిస్థితి పూర్వాపరాల పట్ల ఈ వర్గం కచ్చితత్వాన్ని నిర్ధారించలేదు. మరోవైపు నగరంలో శనివారం భారీ వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ సమాచారం. రామేశ్వరాలయం శివశక్తుల ఆరాధన ఆధ్యాత్మిక సముదాయం కావడం విశేషం. ఈ ఆలయం లింగరాజు మౌసి మా(పిన్నమ్మ) ఆలయంగా ప్రతీతి. ఈ ఆలయంలో శివలింగం, ఇతర నిర్మాణాలు ఉన్నాయి. గర్భగుడిలో దుర్గాదేవి చిత్రం కూడా పూజలందుకుంటుంది.

● బ్రహ్మ కమల వికాసం



అరుదుగా పుష్పించే బ్రహ్మకమలాలు జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌కు చెందిన రంజిత్ దొళాయి నివాసంలో శుక్రవారం రాత్రి వికసించాయి. ఏడాదికోసారి మాత్రమే పుష్పించే ఈ పుష్పాలను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. –రాయగడ

వ్యాధులపై అప్రమత్తత అవసరం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ దుఖిణి, అధికారులు

- మునిగుడ సమితి చైర్‌పర్సన్ నుండ్రుక

రాయగడ: వర్షాకాలం కారణంగా వివిధ రోగాలు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉందని మునిగుడ సమితి చైర్‌పర్సన్ దుఖిణి నుండ్రుక హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పరిశుభ్రత పాటించడం, సకాలంలో చికిత్స పొందడం వంటి వాటిపై ప్రజా ప్రతినిధులు చైతన్య పరచేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక సమితి కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో భాగంగా సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆమె మాట్లాడారు. ప్రజల ఆదరాభిమానాలతో పదవులు చేపట్టిన విషయాన్ని నిరంతరం గుర్తుంచుకోవాలని, వారి సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు. ప్రధానంలో గ్రామాల్లో అపరి శుభ్రత కారణంగా రోగాలు సంక్రమిస్తుంటాయని, దీనిని గుర్తించి.. పంచాయతీ అధికారులు, సిబ్బంది పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి పంచాయతీలో చేడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రధానంగా ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించే విషయంలో ఎటువంటి జాప్యం చేయకూడదన్నారు. తాగునీరు సమకూర్చడంతో పాటు రహదారుల నిర్మాణాలు పూర్తి చేయాలని వివరించారు. గ్రామాలకు సరైన రహదారులు ఉన్నప్పుడే ప్రభుత్వ పథకాలు సులభంగా అందుతాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. సమీకలో మునిగుడ బీడీఓ ప్రీతమ్ కుమార్ తంటి, ఎస్‌డీపీఓ ఆకాష్‌చంద్ర సాహు తదితరులు హాజరయ్యారు.

కోటి 70 లక్షల చేపపిల్లల ఉత్పాదనే లక్ష్యం



మత్స్య విభాగం పెంపకం చేస్తున్న చేపపిల్లలు

జయపురం: ఈ ఏడాది కోటి 70 లక్షల చేప పిల్లలు(సీడ్) ఉత్పాదనే లక్ష్యంగా పెట్టుకున్నామని జయపురం మత్స్య విభాగ అధికారి సింహాచల పాఢి వెల్లడించారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో చేప విత్తన పిల్లల విక్రయాలు ఆలస్యంగా ప్రారంభించినట్లు తెలిపారు. గత రెండేళ్లుగా జిల్లా అధికార యంత్రాంగం చేపల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలోని ప్రతి జలాశయంలో చేపల ఉత్పత్తి ఎలా అభివృద్ధి చేయాలా అనే అంశంపై మత్స్య విభాగం దృష్టి కేంద్రీకరిస్తోందని పేర్కొన్నారు. జీవిక మిషన్ ద్వారా సాధారణ రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా చేపల సాగు ప్రోత్సహించనున్నట్లు ప్రకటించారు. ప్రజల వినియోగం ఆధారంగా ఆయా రకాల చేపల విత్తనాలను ఉత్పత్తి చేయనున్నామన్నారు. అలాగే కొలాబ్, మురాణ, జోలాపుట్ జలాసయాల్లో ఇప్పటికే చేప పిల్లలు విడిచి పెట్టామని వివరించారు.

దోపిడీ దొంగల అరెస్ట్

- బంగారం, నగదు సీజ్ చేసిన పోలీసులు



బాధితునికి చోరీ సొత్తును అప్పగిస్తున్న పోలీసులు

బరంపురం: దోపిడీకి పాల్పడి, పరారవుతున్న దుండగులను వెంబడించిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. దీనిపై ఎస్పీ సరవణ్ వివేక్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బరంపురం జిల్లా పోలీసు పరిధిలో ఈనెల 10న సదర్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. నగర శివారు బంగినబడి గ్రామ జంక్షన్‌లో దోపిడీకి పాల్పడిన ముగ్గురు దోపిడీ దొంగలు అదే సమయంలో బైక్‌పై పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో వారిని వెంబడించిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు గంజాం జిల్లాకు చెందిన లిప్పున సాహు, సంతోష్ పృష్టి, ఉమకాంత్ దొరగా గుర్తించారు. వారి నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దుండగుల నుంచి రికవరీ చేసిన చోరీ సొత్తును బాధితునికి తిరిగి అప్పగించారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్పీ వివేక్ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందించి, సత్కరించారు.



సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎస్పీ వివేక్

'మో ఘురో' రుణాల మంజూరు



లబ్ధిదారులకు రూ.3 లక్షల చెక్కు అందిస్తున్న త్రిపాఠి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్, మునిగుడ, రామనగుడ సమితుల్లో ఏడుగురు లబ్ధిదారులకు మో ఘురొ పథకంలో భాగంగా రూ.3 లక్షల చొప్పున్న రుణాలు మంజూరు చేశారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరై, లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేశారు. రాష్ట్రప్రభుత్వం పేదల సంక్షేమార్థం అమలు చేసిన ఈ పథకంలోభాగంగా జిల్లాలోని 2349మంది రుణాలు పొందేందుకు దరఖాస్తులు పెట్టుకోగా, 1270 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో తొలి విడతగా ఏడుగురికి రుణాలు మంజూరు చేశామని పీడీ తెలిపారు. త్వరలో అర్హులైన అందరికీ రుణాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు భవానీశంకర్ మహాకూర్, మునిగుడ, రామనగుడ ఎస్‌బీఐ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు



బీఎంసీ 5వ నంబరు వార్డు కిషాన్‌నగర్‌లో ఇంజన్ల సాయంతో నీటిని తొలగిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో శనివారం కుండపోత వాన కురిసింది. కటక్–భువనేశ్వర్ జంట నగరాలతో పాటు ఝార్సుగుడ, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, సంబల్‌పూర్, బాలేశ్వర్, కెంజొహర్, గంజాం తదితర జిల్లాల్లో వానలు ముంచెత్తాయి. ఆయా చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భువనేశ్వర్‌లోని ఇస్కాన్ ఆలయ పరిసరాలు, పాత బస్తీ ప్రాంతాల్లో పలుచోట్ల ఈ పరిస్థితి తలెత్తింది. వర్షపు నీరు ప్రవాహానికి అనుకూలమైన ఏర్పాట్లు చేయడంలో నగరపాలక సంస్థ(బీఎంసీ) పూర్తిగా విఫలమైందని సర్వత్రా విచారం వ్యక్తమైంది. మరోవైపు నీరు నిలిచిన ప్రాంతాల్లో తొలగించేందుకు యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టింది. ఇంజన్ల సాయంతో నీటిని బయటకు పారబోశారు. కుండపోత వానలతో విపరీత దిశలో వస్తున్న వాహనాలను గుర్తించడం కష్టతరమైంది. ఈ పరిస్థితుల్లో వాహనాల రవాణా కొంతమేర స్తంభించి పోయింది. రానున్న 5రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) భువనేశ్వర్ కార్యాలయం వెల్లడించింది.

వాయువ్య బంగాళాఖాతం ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరాల మీదుగా తుఫాను పరిస్థితి అలముకుని ఉందని ప్రకటించింది. దీని ప్రభావంతో రానున్న 2, 3 రోజుల్లో ఉత్తర ఒడిశా మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా మరో తుపాను వలయం ఆవిర్భవించే అవకాశం ఉందని సమాచారం తెలిపింది. ఈనెల 18నాటికి వాయువ్య బంగాళాఖాతంలో తాజా తుఫాను తీవ్రత స్పష్టం అవుతుందని వివరించింది.

వివిధ ప్రాంతాల్లో శనివారం నమోదైన వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (మిల్లీమీటర్లు)
ఝార్సుగుడ	121
చాంద్‌బాలి	80.6
భువనేశ్వర్	46.4
బాలేశ్వర్	23.3
పూరీ	15.8
పారాదీప్	15.6
సంబల్‌పూర్	15.4
కెంజొహర్	8.6
గోపాల్‌పూర్	5.4

నవరంగ్‌పూర్‌లో మంత్రి సరక పర్యటన



రాయిఘర్‌లో పర్యటిస్తున్న మంత్రి, పక్కన ఎంపీ, ఎమ్మెల్యేలు

కొరాపుట్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ, న్యాయశాఖ మంత్రి జగన్నాథ సరక నవరంగ్‌పూర్ జిల్లాలో శనివారం పర్యటించారు. జిల్లాలో ఉమ్మర్‌కోట్, రాయిఘర్ సమితులలో సాంఘిక సంక్షేమశాఖ ద్వారా నిర్మితమైన వసతి గృహాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గిరిజన విద్యార్థి విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో ఈ భవనాలు నిర్మించామన్నారు. అధునాతన సదుపాయాలతో కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నిర్మించామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా మంత్రిని జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమాల్లో నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, స్థానిక ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండొ, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్‌చంద్ర మాఝి తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మర్‌కోట్‌లో వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగన్నాథ సరక

ఆటోస్టాండ్‌లో గంజాయి స్వాధీనం



మునిగుడు ఆటోస్టాండ్‌లో గంజాయితో పట్టుబడిన నిందితులు



గంజాయిని ధ్వంసం చేస్తున్న అధికారులు

- మైనర్ సహా, ఇద్దరు నిందితుల అరెస్ట్

రాయగడ: జిల్లాలోని మునిగుడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఆటోస్టాండ్ వద్ద పోలీసులు 66.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మైనర్ తోపాటు మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మోహబా పోలీస్ స్టేషన్ పరిధి కరహంకాల గ్రామానికి చెందిన జితేంద్ర కుమార్(26), మధ్యప్రదేశ్‌లోని జితేపూర్ పోలీస్ స్టేషన్ పరిధి మజౌలి గ్రామానికి చెందిన ఛొటేలాల్ బయిగా(22) ఉన్నారు. దీనిపై మునిగుడ ఎస్‌డీపీఓ ఆకాష్‌చంద్ర సాహు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంధమాల్ జిల్లాలోని బలిగుడ గ్రామం నుంచి గంజాయి తీసుకువచ్చి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది.

ఈ మేరకు మునిగుడ ఐఐసీ సౌధామిని బెహరా నేతృత్వంలో ఏఎస్ఐ సాగర్‌ప్రసాద్ నాయక్, సిబ్బంది ఎస్‌కే శర్మ, ఎస్.కొండగిరి, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ కె.స్వయంప్రకాష్ బృందం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న బస్తాల్లో 66కిలోల 500 గ్రాముల గంజాయి పట్టుబడింది. నిందితులు సరుకును మధ్యప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమికంగా తేలింది. దీనిపై కేసు నమోదు చేసి, నిందితులను శనివారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు.

1674కిలోల గంజాయి ధ్వంసం..

జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 1674కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో స్వాధీనం చేసుకున్న గంజాయిని ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లాయిస్(ఇంఫా) కర్మాగారంలో ధ్వంసం చేశారు. కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రొ సమక్షంలో ఇతర అధికారులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

అనుమానాస్పద రీతిలో డ్రైవర్ మృతి



పోలీస్ స్టేషన్ సమీపంలో దీపక్ మృతదేహం

జయపురం: స్థానిక సబ్ డివిజన్ పరిధి కొట్‌పాడ్-రాయగడ జొగాకలియ ప్రైవేట్ బస్సు డ్రైవర్ అనుమనానాస్పదంగా మృతిచెందాడు. కొట్‌పాడ్ పోలీసు స్టేషన్ వెనుక ప్రాంతంలో వ్యక్తి చలనం లేకుండా పడి ఉండటాన్ని గమనించిన బాటసారులు ముందుగా సీహెచ్‌సీకి తరలించి, పోలీసులకు సమాచారం అందించారు. అయితే అప్పటికే అతను మృతి చెందడంతో ఆత్మహత్య? లేదా హత్య అనే విషయంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొట్‌పాడ్-రాయగడ మధ్య రాకపోకలు సాగించే ప్రైవేటు బస్సు ఎప్పటిలాగే గురువారం రాత్రి 8 గంటలకు కొట్‌పాడ్ చేరింది. అక్కడే బస్సుదిగి వెళ్లిపోయిన డ్రైవర్ దీపక్ ఎంత ఫోన్ చేసినా స్పందించక పోవడంతో పరిసరాల్లో వెతికారు. శుక్రవారం ఉదయం పోలీసు స్టేషన్ వెనుక విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన బాటసారులు అంబులెన్స్‌లో కొట్‌పాడ్ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీపక్ స్వగ్రామం నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ కాగా, అకాల మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేరువులో మునిగి యువకుడి మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బేజంగ్‌వాడ పంచాయతీ కోరుకొండ గ్రామంలో చెరువులో మునిగి, ఓ యువకుడు మృతిచెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన ప్రభాత్ కుతుామ్(22) శనివారం ఉదయం స్నానానికి సమీపంలోని చెరువుకు వెళ్లాడు. అయితే ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. మధ్యాహ్నం అటుగా వెళ్లిన గ్రామస్తులకు చెరువులో శవమై కనిపించాడు. వెంటనే కలిమెల పోలీసులకు సమాచారం అందించడంతో కలిమెల ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి, కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగిస్తామని ఐఐసీ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీ లక్షణాలతో మహిళ మృతి!

విజయనగరం ఫోర్ట్: పట్టణానికి చెందిన ఓ మహిళ డెంగీ లక్షణాలతో శనివారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న వసంత విహార్‌లో నివాసం ఉంటున్న కాజల్ సింగ్(34) అనే మహిళకు ఈ నెల 8వ తేదీన జ్వరం వచ్చింది. 13వ తేదీ వరకు జ్వరం తగ్గకపోవడంతో పరిస్థితి విషమమైంది. దీంతో దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు ఆమెను తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. మహిళ మృతి చెందిన విషయం డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు దృష్టికి వెళ్లడంతో ఆయన విచారణ చేపట్టగా, సదరు మహిళ డెంగీ లక్షణాలతో పాటు మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్ వల్ల మృతి చెందినట్లు తెలిసింది. డెంగీ పరీక్షకు శాంపిల్స్‌ను ప్రభుత్వాస్పత్రికి పంపించామన్నారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రైల్వేట్రాక్‌పై పడిఉన్న వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించి, రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్న విజయనగరం రైల్వే ఎస్‌ఐ రవి వర్మ మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ అతడికి సంబంధించి, ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి, విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి మృతదేహం తరలించారు. ట్రాక్ దాటుతుండగా, రైలు ఢీకొని చనిపోయి ఉంటాడా, లేకపోతే రైలు నుంచి జారిపడి మరణించి ఉంటాడా, లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. మృతుడి వయసు 50 ఏళ్లు పైబడి ఉంటుందని, చారల చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ 9490617089ను సంప్రదించాలని కోరారు. రెండు రోజుల వ్యవధిలో గొట్లాం, కనిమెరక గ్రామం ప్రాంతాల్లోని రైల్వేట్రాక్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకోవడం స్థానికుల్లో కలవరం రేపుతోంది.

సీనియర్ నేతలపై వేటు



జగత్‌సింగ్‌పూర్‌లో ఆందోళనకు దిగిన చిరంజీబ్ బిశ్వాల్ అభిమానులు

- ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్, చిరంజీబ్ బిశ్వాల్‌పై ఆరోపణలు
- పార్టీ నుంచి బహిష్కరించిన కాంగ్రెస్ అధిష్టానం

భువనేశ్వర్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై రాష్టానికి చెందిన ఇరువురు సీనియర్ నేతలను కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. వీరిలో బరాబటి-కటక్ ఎమ్మెల్యే, మహ్మద్ మొకీమ్, మాజీ ఎమ్మెల్యే చిరంజీబ్ బిశ్వాల్ ఉన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) క్రమశిక్షణ చర్యల కమిటీ(డీఏసీ) సెక్రటరీ తారిఖ్ అన్వర్ ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరువురు నేతలు క్రమ శిక్షణకు విరుద్ధంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఇరువురు నిందిత నాయకుల వివరణ కోరుతూ అధిష్టానం నోటీసులు జారీ చేశారు. వీరి వివరణ సంతృప్తికరంగా లేనందున పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్లు తాజాగా జారీ అయిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రాష్ట్రంలో నాయకత్వ సమస్యపై చేసిన వ్యాఖ్యలకు గాను కాంగ్రెస్ ఈ ఏడాది మేలో చిరంజీబ్, మహ్మద్ మొకీమ్ లకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఉప ఎన్నిక ప్రచారంతో..

ఝార్సుగుడ అసెంబ్లీ ఉప ఎన్నికలకు ముందు భువనేశ్వర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పార్టీ వ్యవహారాలు, సంస్థకు వ్యతిరేకంగా చేసిన ప్రకటనల పట్ల వివరణ కోరుతూ వీరివురికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అభ్యర్థి ఎంపిక, ఉప ఎన్నిక కోసం ఓపీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నేతృత్వంలో ప్రచార కమిటీ ఏర్పాటుపై చిరంజీబ్ బిస్వాల్ పలు ప్రశ్నలు సంధించడం తీవ్ర కలకలం రేపింది. రాష్ట్రంలో నామమాత్రంగా 9మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా 20మంది నాయకులు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ పరిస్థితి పార్టీలో ఐక్యతను దెబ్బతీసిందని ఆయన వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఝార్సుగుడ అసెంబ్లీ ఉప ఎన్నిక పురస్కరించుకున జారీ చేసిన కాంగ్రెస్ స్టార్ ప్రచారకుల జాబితాలో ఓపీసీసీ చోటు కల్పించక పోవడం పార్టీపై అసంతృప్తి వైఖరికి ముందస్తుగా అద్దం పట్టింది.

అసంతృప్తి సెగలు..



భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు చిరంజీబ్ బిశ్వాల్‌ను ఏఐసీసీ క్రమ శిక్షణ చర్యల కమిటీ సస్పెండు చేసినట్లు ప్రకటించింది. ఈ చర్యల పట్ల జగత్‌సింగ్‌పూర్ జిల్లా కాంగ్రెస్ శిబిరంలో అసంతృప్తి సెగలు వేడెక్కాయి. సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయిన సమాచారం అందిన మరుక్షణమే వీరంతా రోడ్డెక్కారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ నాయకుడిగా గుర్తింపు పొందని తమ ప్రియతమ నాయకుడి పట్ల సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడం అత్యంత విచారకరమన్నారు. ఈ విషయంలో పార్టీ అధిష్టానం మరోసారి పరిశీలించి సానుకూలంగా స్పందించకుంటే ఆందోళన మరింత ఉధృతం అవుతుందని పేర్కొన్నారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ కుతంత్రపు చర్యతో ఇటువంటి విచారకర పరిస్థితులతో రాష్ట కాంగ్రెస్ విలువలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులు ఉపసంహరించకుంటే జగత్‌సింగ్‌పూర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గం, కార్యకర్తలు అంతా సామూహికంగా రాజీనామా చేసి పార్టీ నుంచి వైదొలుగుతామని హెచ్చరించారు. చిరంజీబ్ బిశ్వాల్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని తప్పుడు నివేదికలను దాఖలు చేయడంలో పీసీసీ చీఫ్ పాత్రధారిగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ చర్యకు నిరసనగా జగత్‌సింగ్‌పూర్ వీధుల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. శరత్ పట్నాయక్ దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన ప్రదర్శించారు.

ఏ పార్టీలో చేరేది లేదు..



భువనేశ్వర్: పార్టీ ఫిర్యాయింపులపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బరాబటి-కటక్ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్ స్పందించారు. పార్టీ సస్పెన్షన్ నేపథ్యంలో ఏ పార్టీలో చేరేది లేదని స్పష్టంచేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌తో ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. ఒక వేళ పార్టీ టికెట్ నిరాకరిస్తే స్వతంత్ర అభ్యర్థిగా మాత్రమే పోటీ చేసి, సత్తా చాటుకుంటానని వెల్లడించారు. అధిష్టానం పట్ల ఎటువంటి బేదాభిప్రయాలు లేవన్నారు. అలాగే ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్‌తో ఎటువంటి వ్యక్తిగత స్పర్థలు, విబేధాలు లేవని తెలిపారు. పార్టీ పట్ల విధేయతతో అడపా దడపా తలెత్తిన తప్పిదాలను వేలెత్తి చూపడం వెనక ఆంతర్యాన్ని గ్రహించుకోలేని దయనీయ పరిస్థితుల్లో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయని సున్నితంగా వ్యాఖ్యానించారు. భావ వ్యక్తీకరణ పరిస్థితుల లోతుపాతుల్ని సమీక్షించి, సానుకూలంగా ప్రతిస్పందిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

షూటింగ్ సందడి



గజపతి ప్యాలెస్ వద్ద జరుగుతున్న చిత్రీకరణ

పర్లాకిమిడి: పట్టణంలోని రాజవీధిలో గజపతి ప్యాలెస్ వద్ద ఓ ప్రైవేట్ ఆల్బమ్ పాటల చిత్రీకరణ శనివారం జరిగింది. భువనేశ్వర్‌కు చెందిన పాటల బృందం రాత్రి 9గంటల వరకు చిత్రీకరణ చేపట్టారు. అంతకుముందు బృందావన ప్యాలెస్ వద్ద షూటింగ్ నిర్వహించారు.

స్థానికులు ఈ చిత్రీకరణ తిలగించేందకు ఆసక్తి చూపారు.

బస్తీల అభివృద్ధిపై ఓఎస్‌డీ సమీక్ష



సమీక్షలో అధికారులు, బస్తీ సంఘం ప్రతినిధులు

జయపురం: పట్టణ పరిధిలోని బస్తీల అభివృద్ధిపై రాష్ట గృహ, పట్టణ అభివృద్ధి విభాగం, మున్సిపాలిటీ అధికారులు సమీక్ష చేపట్టారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో రాష్ట జాగా మిషన్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ) అలోక్‌రంజన్ సామంతరాయ్, నృశింహచరణ్ థల్, బస్తీవాసుల సంఘం ప్రతినిధులు పాల్గొని, వివిధ సమస్యలపై చర్చించారు. పట్టణంలోని బస్తీలున అభివృద్ధి పరిచిన అనంతరం వాటిని బిజూ ఆదర్శ కాలనీలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈఓ సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు.

బస్తీల్లో జరుగుతున్న మౌలిక వసతుల పనులకు అంతా సహకరించాలని కోరారు. సమావేశంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ముక్త టీం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ పట్టణంలోని ఆదర్శ పోలీస్ స్టేషన్ నుంచి ఆర్టీఓ సంతనుకుమార్ పరిడా, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి(ఐఐసీ) బబులీ నాయక్ చైతన్య ర్యాలీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి లోని హైస్కూల్ జంక్షన్, రాజవీధి, ఎంఆర్ బాయ్స్ హైస్కూల్, సరస్వతీ శిశుమందిర్ తదితర ప్రాంతాల్లో విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని, కార్లలో సీటుబెల్ట్ ధరించాలని, బైక్‌పై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదని అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు సురక్షిత ప్రయాణం చేయాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.



ర్యాలీలో పాల్గొన్న ఆర్టీఓ సంతనుకుమార్

రాష్ట్రాభివృద్ధే బీజేడీ ధ్యేయం



వేదికపై మంత్రి ఉషా దేవి, ఎంపీ శేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్, మేయర్ సంఘమిత్ర

- రాజ్యసభ సభ్యుడు మానస్ మంగరాజ్

బరంపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాయకత్వంలో బీజేడీ ప్రభుత్వం రాష్ట అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తోందని రాజ్యసభ సభ్యుడు, బీజేడీ బరంపురం లోక్‌సభ ఇన్‌చార్జి మానస్ మంగరాజ్ తెలిపారు. రాష్ట మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషా దేవి అధ్యక్షతన గంజాం జిల్లా చికిటి నియోజకవర్గ పరిధిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలకు రూ.లక్ష చొప్పున రుణాలు, 50మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, 40మంది మహిళలకు రూ.20 వేల చొప్పున రుణాలు అందించారు. కార్యక్రమంలో బరంపురం ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మానస్ మంగరాజ్

ఉపాధ్యాయుడు.. దారుణ హత్య

- పాతకక్షలే కారణం
- పథకం ప్రకారమే దారుణానికి ఒడిగట్టిన దుండగులు
- మీడియా సమావేశంలో డీఎస్పీ వెల్లడి
- రోడ్డుపై బైఠాయించి, బంధువుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు



కృష్ణ(ఫైల్)

రాజాం సిటీ: మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ(58) దారుణ హత్యకు గురయ్యాడు. తొలుత ఉపాధ్యాయుడి మృతిని అంతా ప్రమాదంగా భావించి, బంధువులకు సమాచారమిచ్చారు. మరోవైపు విషయం తెలుసుకున్న రాజాం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతిపై ఆరాతీశారు. రక్తపు మడుగులో ఉపాధ్యాయుడి మృతదేహం, అతడి ముఖంపై గాయాలు ఉండడంతో దానిని హత్యగా గుర్తించారు. స్థానికులతో పాటు ఉపాధ్యాయుడి స్వగ్రామంలో కూడా దర్యాప్తు చేయగా ఉపాధ్యాయుడు హత్యకు గురైనట్లు తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రాజాం పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న ఏగిరెడ్డి కృష్ణ తెర్లాం మండలంలోని కాలంరాజుపేటలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఎప్పటిలాగే పాఠశాలకు బయలుదేరిన ఆయన కొత్తపేటకు దగ్గరలో హత్యకు గురయ్యాడు. మృతదేహం రోడ్డు పక్కనే బొలెరో వాహనం వద్ద పడి ఉంది. స్థానికులు ఈ విషయాన్ని రాజాం పోలీసులకు తెలియజేయగా, అక్కడికి చేరుకున్న పోలీసులు కృష్ణ మృతదేహాన్ని గుర్తించి, బంధువులకు విషయం తెలియజేశారు. అక్కడికి చేరుకున్న బంధువులు మృతదేహంపై పడి బోరున విలపించారు.

ఫిర్యాదులో ఏముంది..

తాము కొంతకాలంగా రాజాంలోని గాంధీనగర్‌లో ఉంటున్నామని, తన తండ్రి కృష్ణ 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందారని కృష్ణ కుమారుడు శ్రావణ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతకు ముందు తమ స్వగ్రామం తెర్లాం మండలం, ఉద్దవోలులో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలుపొంది, సేవలందించారన్నారు. ఉద్యోగం రావడంతో రాజాంలో ఉండి, ప్రశాంత జీవనం గడుపుతున్నామని, పరోక్షంగా గ్రామంలో రాజకీయాలకు మద్దతుగా నిలుస్తుండేవాడన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన వ్యక్తికి తన తండ్రి మద్దతు ఇచ్చాడని, దీనిని ఓర్వలేక ప్రత్యర్థివర్గమైన మరడాన వెంకటనాయుడు, మరడాన మోహనరావు, మరడాన గణపతి, మరడాన రామస్వామిలు మా నాన్నపై కక్ష పెంచుకున్నారని పేర్కొన్నారు. ఎప్పటిలాగే మా నాన్న శనివారం స్కూల్‌కు వెళ్తుండగా, ఇదే అదునుగా భావించిన దుండగులు హత్యకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య..

విజయనగరం క్రైమ్: భార్య మందలించిందన్న మనస్తాపంతో కర్ని శివకుమార్(34) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడి, మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను టూటౌన్ పోలీసులు శనివారం వెల్లడించారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న శివకుమార్ విశాఖలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసగా మారిన అతడిని భార్య ఎప్పటిలాగే మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు బాత్రూమ్ క్లీనర్‌ను తాగేశాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఏఎస్‌ఐ రామారావు తెలిపారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..



సంఘటనపై ఆరాతీస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే వెంకట చినఅప్పలనాయుడు, చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి

హత్య విషయం తెలుసుకున్న చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి ఘటన స్థలానికి చేరుకుని, హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి కక్ష పూరితమైన హత్య ఇదే మొదటిసారి చూడడమని, హంతకుల గురించి కచ్చితమైన సమాచారం ఉందని, త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సైతం ఘటన స్థలానికి చేరుకుని, హత్యకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

బొలెరోతో ఢీకొట్టి, ఈడ్చుకుంటూ వెళ్లి..



మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కృష్ణ ముఖంపై బలమైన గాయాలు ఉండడంతో బంధువులతో పాటు పోలీసులు కూడా హత్యగా అనుమానించి, ప్రమాద స్థలం వద్ద ఉన్న ఇరుగు పొరుగు షాపుల వారిని, దర్యాప్తు చేశారు. ఓ షాపు యజమానితో పాటు హత్యను కళ్లారా చూసిన ఓ ఆటోడ్రైవర్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. బొలెరో వాహనంతో ఢీకొట్టి, ఈడ్చుకుంటూ కొంత దూరం తీసుకువెళ్లారని, వాహనంలో నుంచి డ్రైవర్ దిగి, కృష్ణ మృతి చెందాడో లేదో తెలుసుకుని చెప్పులు, రాడ్డుతో దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు వివరించారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేయగా, కృష్ణకు తన స్వగ్రామం ఉద్దవోలులో రాజకీయ విబేధాలు ఉన్నాయని, దాని కారణంగానే హత్య జరిగినట్లు పోలీసులు వివరించారు. కృష్ణ కుటుంబీకులు కూడా ఉద్దవోలు గ్రామానికి చెందిన వారే(రెండో వర్గీయులు) పాతకక్షలు మనసులో పెట్టుకుని, ఈ హత్య చేశారన్నారు. కృష్ణ కుమారుడు శ్రావణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, మృతుని కుటుంబీకులు, బంధువులు పెద్దఎత్తున ఘటనా స్థలికి చేరుకుని, రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేశారు. హంతకులను త్వరగా పట్టుకుని, శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రైతుబజార్లలో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం


రైతుబజారులో బియ్యం విక్రయం ప్రారంభించిన జేసీ నవీన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అతి తక్కువ ధరకే నాణ్యమైన (సూపర్ ఫైన్ రకం) బియ్యాన్ని ప్రజలకు అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. శ్రీకాకుళం రైతు బజారులో ఏర్పాటుచేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా ఉన్నాయని, వీటిని అరికట్టేందుకు, సాధారణ ప్రజానీకానికి తక్కువ ధరకే బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. సాధారణ రకం బియ్యం రూ.35, బిపిటి రకం బియ్యం రూ.48గా నిర్ణయించామన్నారు. రైతుబజారుతో పాటు నగరంలో మరో మూడు చోట్ల బియ్యాన్ని విక్రయించనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి ఆమదాలవలస, కోటబొమ్మాళి రైతుబజార్లలో విక్రయ కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. బియ్యం ధరల నియంత్రణకు కమిటీని వేశామని, విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, మార్కెటింగ్ ఎ.డి.కైలాశరావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనరల్ రాణిమోహన్, డీటీ గోపాల్, రైతు బజార్ ఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

అమర జవాన్ల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: యుద్ధంలో మృతి చెందిన సైనికుల కుటుంబాలకు 300 చదరపు అడుగుల నివాస స్థలాలు మంజూరు చేస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సైనిక బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పదేళ్ల కాలం పైబడి మాజీ సైనికుని కోటాలో మంజూరైన భూములను 22ఎ నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, జిల్లా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎ.శైలజ, జిల్లా సైనిక సంక్షేమాధికారి, వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు (రిటైర్డ్) పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం


రికవరీ సామగ్రితో సీఐ ఆదాం, ఎస్సై సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న దొంగతనాలకు సంబంధించిన చోరీసొత్తును పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేశారు. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో జేఆర్‌పురం సీఐ ఆదాం వివరాలు వెల్లడించారు. మార్చిలో అల్లినగరంలోని లక్ష్మీదేవి ఆలయంలో చోరీ, బైక్ మాయం, 2021లో ఆటో అపహరణ కేసుల్లో లావేరు మండలం లోపెంట గ్రామానికి చెందిన కంబాపు రమణను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు. ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్లు సమీపంలో జరిగిన చోరీకి సంబంధించి నాలుగు తులాల గొలుసు, మూడున్నర తులాల నల్లపూసలు, రూ.25200 నగదు రికవరీ చేశామన్నారు. ఈ కేసులో రాజమండ్రి ప్రాంతానికి చెందిన నిందితుడు గెద్దెల చిన్నబాబును అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎస్సై వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఆరవెల్లి'కి నివాళులు


నివాళులు అర్పిస్తున్న ఉపనిషన్మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సంస్కృతాంధ్ర పండితులు, ఉపనిషన్మందిరం పూర్వ కార్యదర్శి ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు ప్రథమ వర్ధంతి శనివారం అరసవల్లి బాలాజీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఉపనిషన్మందిరం ప్రతినిధులు హాజరై నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్ మాట్లాడుతూ 50 ఏళ్ల పాటు ఆరవెల్లి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆరవెల్లితో గల సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మందిర ఉపాధ్యక్షులు పి.పతంజలిశాస్త్రి, సభ్యులు ఎన్.నరసింహమూర్తి, ఆర్.ప్రసాదరావు, జంధ్యాల శరత్ బాబు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఖరీఫ్..రిలీఫ్


వంశధార ఎస్‌ఈ దోల తిరుమలరావు

ఈ ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు సైతం నీరు అందించడానికి చర్యలు తీసుకున్నామని బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్‌ఈ దోల తిరుమలరావు తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో ప్రతి గ్రామంలో పిల్ల కాలువలు శుభ్రం చేయాలని సూచించారు. తమ పరిధిలో ఉన్న అంశాల మేరకు సమస్యలను పరిష్కరించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. ఖరీఫ్ పనులు జోరుగా జరుగుతున్న సమయంలో ఆయన 'సాక్షి'తో ముచ్చటించారు. – శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

- ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం
- పిల్ల కాలువల పనులు ఉపాధి హామీలో పూర్తి చేసుకోవాలి
- 'సాక్షి'తో వంశధార ఎస్‌ఈ దోల తిరుమలరావు

సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న: వంశధార కాలువల్లో పూడిక బాగా పేరుకు పోవడం, కొన్ని చోట్ల స్ట్రక్చర్స్ దెబ్బతినడంతో సాగునీటి ప్రవాహానికి ప్రధాన సమస్యగా ఉన్నట్లు తెలు స్తోంది? దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎస్‌ఈ: పూడిక తీత పనులు, మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. గతంలో నరసన్నపేటలో చోటుచేసుకున్న షట్టర్ల అవినీతి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో కొత్తవి ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అయినా శివారుకు నీరు అందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాం. ఈ ఏడాది జూన్ మూడో వారంలో నీరు విడిచిపెట్టి శివారు భూములకు తొలుత ఇవ్వాలనుకుంటున్నాం. గొట్టా బ్యారేజీలో 0.5 టీఎంసీ మేర నీరు ఉంది. వర్షాలు పడితే నీటిని విడుదల చేస్తాం. శివారు భూములకు సాగు నీరందకపోవడానికి కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడమే కారణం.

ప్రశ్న: కాలువలు బాగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా?

ఎస్‌ఈ: కాలువల్లో గుర్రపుడెక్క పెద్దఎత్తున పెరగడంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గుర్రపు డెక్క తొలగింపునకు రూ.50 లక్షల వరకు నిధులు అవసరమవుతాయి. దీనిపై కలెక్టర్‌కు కూడా ప్రతిపాదనలు పెట్టాం.

ప్రశ్న: పూడిక తీతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?


ఎస్‌ఈ: వంశధారలో పూడిక తీత, రెగ్యులేటర్లు, స్లూయిజ్‌ల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఎడమ కాలువ కోసం రూ.5.50 కోట్లు కుడి కాలువకు రూ.4.50 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే పనులు చేపడతాం. వంశధార, కుడి ఎడమ కాలువలకు మొత్తం 260 మంది లష్కర్లు కావాలి. ప్రస్తుతం 98 మంది పనిచేస్తున్నారు. సాగునీటి రెగ్యులేషన్ కోసం జిల్లా అవసరాల దృష్ట్యా 130 మంది కావాలని ప్రభుత్వాన్ని అడిగాం. ప్రభుత్వం అనుమతిస్తే అదనంగా లష్కర్లను నియమిస్తాం. లేదంటే పాత వారినే మళ్లీ కొనసాగిస్తాం.

ప్రశ్న: ఆఫ్‌షోర్ పనులు పరిస్థితి ఎలా ఉంది?

ఎస్‌ఈ: గతంలో ఆఫ్‌షోర్ పనులు 38 శాతం జరిగి నిలిచిపోయాయి. ఈ ఏడాది మరో ఏడు శాతం పనులు జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులతో మాట్లాడి పునరావాసం, భూసేకరణకు ఉన్న అడ్డంకులను తొలగించాం. రెండేళ్లలో పనులు పూర్తవుతాయి.

ప్రశ్న: షట్టర్ల కుంభకోణం అంశం ఎంత వరకు వచ్చింది?

ఎస్‌ఈ: షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. నాగావళి-వంశధార నదుల అనుసంధాన పనులు ఇప్పటివరకు 78 శాతం పూర్తయ్యాయి. ఈ ఖరీఫ్‌కు పనులు పూర్తయ్యే అవకాశం లేదు.



ప్రశ్న: హిరమండలం లిఫ్ట్ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

ఎస్‌ఈ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల హిరమండలం ఎత్తిపోతల పథకానికి భూమి పూజ చేశారు. సర్వే, డిజైన్లు పూర్తయ్యాయి. పంపులు, మోటార్ల కొనుగోలుకు ఏజెన్సీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెలలో పనులు ప్రారంభించి డిసెంబరులో పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నం చేస్తాం.

ప్రశ్న: కాలువల ఆధునీకీకరణ, స్టేజ్-2, ఫేజ్-2 పనులు ఎంత వరకు జరిగాయి?

ఎస్‌ఈ: శిథిలావస్థలో ఉన్న వంశధార ఎడమ కాలువలను ఆధునికీకరించాల్సిందే. దశల వారీగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూ.950 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. మొదటి దశలో అండర్ టన్నెల్స్, ఆఫ్ టేక్ స్లూయిజ్‌లు తక్షణం పునర్నిర్మించాలి. నిధులు రాగానే ప్రారంభిస్తాం. స్టేజ్-2, ఫేజ్-2కు సంబంధించి ప్యాకేజీ-87, 88 పనులు దాదాపు పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 93 శాతం జరిగాయి. ప్రస్తుతం స్పిల్‌వే పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గొట్టా బ్యారేజీ వద్ద ఇసుక కొట్టుకుపోయి రాతి పరుపు (ఏప్రాన్) పాడైంది. దాన్ని పునర్నిర్మించేందుకు రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. ఇంకా ఆమోదం రావాల్సి ఉంది.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ శాఖాధికారులందరూ ప్రజా సేవకులని, పౌరులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా, శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) చైర్మన్ జి.జ్ఞానశ్రీ సువర్ణరాజు సూచించారు. శనివారం స్థానిక న్యాయ సేవా సదన్ కార్యాలయంలో శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఆ విధంగా వచ్చిన కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీచేస్తారని, సమస్య లేకుంటే కేసు ముగిస్తారని వివరించారు. శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో కేసులు చేయడానికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కేసైనా కేవలం 90 రోజుల్లో పరిష్కారమవుతుందని, సివిల్ కోర్టుల్లో మాదిరిగా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ గృహ నిర్మాణ సంస్థ, రెవెన్యూ, ప్రజా రవాణా సంస్థ, నగర పాలక సంస్థ, తపాలా, బ్యాంకింగ్, ఉపాధిహామీ, నీటిసరఫరా, పారిశుద్ధ్యం, విద్య, భీమా, వైద్య సేవలు, విద్యుత్, టెలిఫోన్ తదితర సేవలు సమాజంలోని పౌరులకు పక్కాగా అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ చల్లా ఓబులేసు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ న్యూరోకేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో శ్రీకాకుళం శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్న రెండు రోజులు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓబులేసు మాట్లాడుతు క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు లభిస్తుందన్నారు. శ్రీకాకుళం నగరంలో ఒక ఇండోర్ స్టేడియం సరిపోవడంలేదని, జాతీయస్థాయి టోర్నమెంట్ల నిర్వహణ సాధ్యం కావడంలేదని సాగర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా మరో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపునకు కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, ఎగ్జిక్యూటీవ్ ప్రెసిడెంట్ భైరి దామోదరరావు, గ్లోబల్ న్యూరోకేర్ ఎండీ డాక్టర్ దేవరెడ్డి గౌతమ్, అసోసియేషన్ సీఈవో సంపతిరావు సూరిబాబు, గురుగుబెల్లి ప్రసాద్, ఎంఈ రత్నాజీ, అనీల్ కుమార్, మెంట శాంతికుమార్, డాక్టర్ రవికుమార్, కోచ్‌లు, అంపైర్లు, టెక్నికల్ సిబ్బంది, గ్లోబల్ న్యూరోకేర్ సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరు విభాగాల్లో పోరు..

అండర్-11, 13, 15, 17, 19, సీనియర్స్ విభాగాల్లో నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 350 మంది వరకు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. పోటీలకు హాజరైన క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లను కల్పిస్తున్నారు. పోటీలకు చీఫ్ రిఫరీగా అంతర్జాతీయ స్థాయి అంపైర్ సంపతిరావు సూరిబాబు వ్యవహరిస్తారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా కార్తికేయ స్పోర్ట్స్ అకాడమీ, సీఎస్ఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండురోజులు జరగనున్న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలను శనివారం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ డైరెక్టర్ చౌదరి సతీష్ మాట్లాడుతూ శ్రీకాకుళంలో త్వరలోనే భారీస్థాయిలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, సామాజికవేత్త సూర శ్రీనివాసరావు, అంధవరపు సంతోష్, ఆర్కే షాపింగ్ మాల్ కిరణ్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు, చౌదరి అవినాష్, చౌదరి సత్యనారాయణ, వేణుగోపాల్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్, వైఎస్‌వికుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు..

తొలిరోజు జరిగిన నాలుగు రౌండ్లలో క్రీడాకారులు ఎత్తుకు పైఎత్తులేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి 135 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో 32 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులు పాల్గొనడం విశేషం. శ్రీకాకుళం జిల్లా నుంచి రికార్డుస్థాయిలో 60 మంది ప్లేయర్స్ ప్రాతినిధ్యం వహించారు. పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా ఫణికుమార్ (విజయవాడ) వ్యవహరిస్తున్నారు.

గరిమెళ్ల స్ఫూర్తిప్రదాత


విద్యార్థులకు గరిమెళ్ల మెరిట్ అవార్డులు అందజేస్తున్న బాడాన రాజు

పోలాకి: స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ కవితా సార్వభౌముడు గరిమెళ్ల సత్యనారాయణ 130వ జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారంలోని ఆయన విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గరిమెళ్ల ట్రస్ట్ కార్య దర్శి బాడాన రాజు మాట్లాడుతూ జాతీయోద్య మ సమయంలో సిక్కోలు పౌరుషాన్ని చూపిన స్ఫూర్తి ప్రదాత గరిమెళ్ల అని అన్నారు. నేటి తరం గుర్తుంచుకునేలా జయంత్యుత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గరిమెళ్ల మెరిట్ అవార్డులు అందజేశారు. ఎంపీటీసీ సుంకరి ప్రసాదరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో గరిమెళ్ల పేరు మీద ఉన్న కళాశాల, పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్‌లో వృద్ధాశ్రమం, అనాథాశ్రమం ఏర్పాటు చేయ డానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

చెక్‌పోస్టులో ఇక నగదు రహిత లావాదేవీలు


చెక్‌పోస్టు వద్ద నగదు రహిత సేవలపై అవగాహన కల్పిస్తున్న డీటీసీ శివరామప్రసాద్

ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ఆర్టీఓ కార్యాలయంలో నగదు రహిత లావాదేవీలు ప్రారంభమైనట్లు డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) శివరామప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం పురుషోత్తపురం చెక్ పోస్టుని తనిఖీ చేశారు. అనంతరం లారీ డ్రైవర్లతో కార్యాలయం వద్ద నగదు రహిత లావాదేవీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు. ప్రభు త్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అక్రమాలకు చెక్ పడుతుందన్నారు. ఈ నెల 12 నుంచి నగదు రహిత లావాదేవీలను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చెక్‌పోస్టుల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డ్రైవర్లకు పూర్తి అవగాహన కలిగే వరకు చెక్‌పోస్టుల వద్ద 3 ప్రైవేట్ కామన్ సర్వీస్‌సెంటర్(సిఎస్‌సి) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

శారీరక శ్రమకు క్రీడలు అవసరం


విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: శారీరక శ్రమకు క్రీడలు ఎంతో దోహదపడతాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని వప్పంగి గ్రామంలో గల ఓ కల్యాణ మండపంలో శనివారం రాష్ట్రస్థాయి ఉషూ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటు నేటితరం పిల్లలు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. పోటీలు నిర్వహించిన వారిని అభినందించారు. 13 జిల్లాల నుంచి 285 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉషూ అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి శివకుమార్, కొరమ భాస్కరరావు, క్రిష్ణనాయుడు, వాకర్స్ ప్రతినిధులు ఇందిరాప్రసాద్, జోగినాయుడు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్ సురేఖ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్


కాలువ ఉన్న మృత దేహం


నారాయణరావు (ఫైల్)

కాలువలో వ్యక్తి మృతదేహం

నరసన్నపేట: మండలంలోని గునబపేటకు చెందిన దుప్పట్ల నారాయణరావు(57) మూడు రోజుల క్రితం అదృశ్యం కాగా శనివారం ఆయన మృతదేహాన్ని నరసన్నపేట పోలీసులు ఉర్లాం హైస్కూల్ ఎదురుగా రోడ్డు పక్క కాలువలో గుర్తించారు. రోడ్డు ప్రమాదమే మృతికి కారణమని పోలీసులు నిర్ధారించారు. గురువారం సాయంత్రం నారాయణరావు పని ఉందంటూ ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లారు. ఆ రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు శుక్రవారం నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈలోగా శనివారం ఉదయం ఉర్లాం ప్రధాన రోడ్డుకు ఆనుకొని స్కూల్‌కు ఎదురుగా ఉన్న కాలువలో తుప్పలు తొలగించేందుకు ఉపాధి వేతనదారులు వెళ్లగా నారాయణ మృతదేహం, అక్కడకు దగ్గర్లో ద్విచక్ర వాహనం గుర్తించారు. వెంటనే నరసన్నపేట పోలీసులకు ఉర్లాం వీఆర్వో ప్రసాదరావు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ వై.సింహాచలం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గునబుపేటలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు పరిశీలించి కన్నీరుమున్నీరయ్యారు. నారాయణరావుకు భార్య రాజకుమారి, కుమారుడు కామేశ్వరరావు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురి కావడం, రోడ్డు పక్కన 10 అడుగుల లోతులో ఉన్న కాలువల్లో పడిపోవడం, అక్కడ తుప్పలు ఉండటంతో ఎవరూ గుర్తించలేదు. కుమారుడు కామేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

పోలాకి: మండలంలోని పిరువాడ గ్రామానికి చెందిన కరణం లచ్చుమయ్య(59) పాముకాటుతో మరణించాడు. లచ్చుమయ్య శుక్రవారం రాత్రి భోజనం చేశాక అమ్మవారి ఆలయం వద్ద నుంచి నడిచి వస్తుండగా పాము కరిచినట్లు అనిపించడంతో వెంటనే ఆర్‌ఎంపీని సంప్రదించాడు. విష సర్పం కరిచినట్లు నిర్ధారించి అతని సూచన మేరకు నరసన్నపేటలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన రమణమూర్తి

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. రేగిడి మండలం అంబకుండి గ్రామానికి చెందిన పల్లి రమణమూర్తి వ్యవసాయం చేస్తూ మరోవైపు చిల్లర దుస్తుల వ్యాపారం చేస్తుండేవాడు. ఈయనకు భార్య పుష్ప, ఇద్దరు కుమార్తెలు ద్రాక్షాయిని, నందిని ఉన్నారు. శనివారం మధ్యాహ్నం అద్దె ఇంటిలో రమణమూర్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి


పకీర్(ఫైల్)

టెక్కలి రూరల్: బొప్పాయిపురం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన అడపా పకీర్(56) అనే మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పకీర్ తన గ్రామం నుంచి బొప్పాయిపురం ఆటోలో వచ్చింది. రోడ్డు దాటుతుండగా పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మహిళ మృతి చెందింది. పకీర్‌కు భర్త బాబా ఉన్నారు. టెక్కలి ఎస్‌ఐ-2 రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు

టెక్కలి రూరల్: స్థానిక పాలకేంద్రం సమీపంలో ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి కోరాడ సతీష్ ద్విచక్రవాహనం నగదు, బ్యాగ్‌ను చోరిచేసిన ఘటనలో ముగ్గురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడిన వారు కర్రి బోగేశ్వరరావు (సీతారాంపల్లి), సానిల పవన్, గేదెల కుమార్(టెక్కలి)లను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి బ్యాగు, రూ.8వేలు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హమ్మయ్య.. ఎలుగు చిక్కింది




ఎలుగుకు ట్రాంక్విలైజర్‌తో మత్తు మందిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) ఎలుగు ఇదే..

మందస: ఉద్దానంలో హల్‌చల్ చేసిన ఎలుగుబంటి ఎట్టకేలకు బోనుకు చిక్కింది. ఇటు అటవీ శాఖాధికారులు, అటు పోలీసులను శుక్రవారం నానా తిప్పలు పెట్టిన ఎలుగును శనివారం మత్తు మందు ఇచ్చి పట్టుకున్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లోహరిబంద పంచాయతీ యశోదనగర్ మెట్ట వద్ద ఎలుగు ప్రదక్షిణలు చేస్తూ రోజంతా ఒకే చోట తిరుగుతుండడంతో స్థానికులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలుగును పట్టుకోవడానికి డీఎఫ్‌ఓ నిషాకుమారి, సిబ్బంది విఫల యత్నం చేశారు. శనివారం కూడా ఎలుగు అదే తీరున తిరుగుతూ ఉండడంతో విశాఖ జూ నుంచి వచ్చిన డాక్టర్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో ఎలుగుకు ట్రాంక్విలైజర్ షూట్‌తో మత్తు మందును ఇచ్చారు. అది నిద్రలోకి ఎలుగు జారుకోగానే అటవీశాఖ సిబ్బంది పట్టుకుని, బోనులో బంధించారు. 15 నిమిషాల అనంతరం యాంటీడోస్‌ను ఇచ్చి, వ్యాన్‌లో విశాఖపట్నంలోని జూకు తరలించారు.